

# కొత్తచిగురు

రాచకొండ రంగనాథశాస్త్రి

"పరుశురాంవుడికి మరనశిచ్చ కాయం జేసీసారు"

పట్నం నుంచి ఆదరాబాదరా వచ్చిన అవతారం సైకిల్ని ఊరి నడిబొడ్డులో ఉన్న 'శివాలచ్మి' కాపీ వొటేలు అనబడే పాకలో రాటకు జారవేస్తూ అని 'ఓటాంగ్ టీ కొట్టే లచ్మి' అన్నాడు ఆయసాన్ని నణచుకుంటూ.

యిడ్లీ తప్పేలాలు తోంవుతూన్న శివాలచ్మి సేతులు కడుక్కొని పైట కొంగు తుడుచుకుంటూ 'ఏటి–ఏటవతారం నువ్వంతూన్నది' అంది.

"అదే మన పరుశురాంవుడికి పెద్ద కోరుట్లో మరనశిచ్చ ఖాయం జేసేసారు" అలా అనడంలో అవతారం గొంతు ఎందుకో చిన్నగా వణికింది–

శివాలచ్చిమి ముఖం వికసించింది ఆ మాటలతో.

'పేదిరగడయింది-' అంటూ మెటికలు విరిచింది-'అయినా సచ్చినోడికి బూఁవీ ఆ కా శ ం కనిపించీదా. ఆడు వేసిన అన్నేయాలు ఊరికే పోతాయా ' టీ చేస్తూనే గొణుగుతోంది శివాలచ్చిమి.

నీ కడుపు సల్లగుండ-మంచి వార్త తెచ్చినావు-'టాఁగ్' 'టీ' చేసి పైనింత 'మిగడేసి' ధావిపైన దట్టంగా 'పందార' జల్లి అవతారాని కిస్తూ 'తాగు దీనికి పైసాలివ్వక్కర్నేదులే-' ఇయ్యాల అందరికీ పైసలు తీసుకోకుండానే టీ లిస్తే రా యిదో సూరమ్మత్తా అంటూ' టీ గ్లాసు టేబిల్ మీది పెట్టేసి మనవడికి నీళ్లోస్తున్న సూరమ్మ దగ్గరికి పరుగెత్తింది ఆ మాట కాస్తా చెప్పేసి వెంటనే వచ్చేసింది-అప్పటి కింకా అవతారం టీ తాగుతూనే ఉన్నాడు. యింతకీ మల్లీ ఆడు కోరుట్లో ఏటయినా సెప్పాడా?" టేబుల్ దగ్గరగా స్టూల్లాక్కుంటూ అడిగింది.

ఏటి సెప్తాడు-పై కోరుటు కెల్తం ఆడి కిట్టఁవేనేదు.-ఆ లాయరు సిదంబరం గోరు మరి కాత్త గుంజుకోవచ్చుని పై కోరుటు కప్పీలు జేయించేడు.-కింద కోరుట్లో జెప్పిందే పై కోరుట్లోనూ సెప్పేడు " జరిగిందంతా విజఁవేఁ యేదో యెదవ మైకంలో అట్టా జేసీపేను- అయిందానికి సిగ్గుతోనూ బాత్తోనూ సత్తున్నాను....కోరుటువాల్లు దయతలచి వన్నొగ్గెత్తే .... నీతిగా బతుకుతాను... బతిగుండగా యెప్పుడూ అట్టాటి పన్లు సెయ్యనూ"అన్నాడు. కోర్టిన్నేదు.ఆడికా అవకాశం ఇయ్యటం దురమార్గాన్ని తిరిగి దేశంమీదికి ఒదిలీటానికి సట్టాలొప్పుకోవు. కనక కింది కోరుటోరు యేసినశిచ్చనే యీ కోరుటు కాయం జేసింది 'అని జడిజీగారు సదివి సీట్లోంచి లేచెల్లిపోనారు' అని ముగించాడు అవతారం.

* * *

పరుశురావుఁడుకు ఆ వూరొచ్చేసరికి ఇరవై ఎన్దేళ్లుఁటాయ్. చేతిలో ఓ పంచీ పంచీలో ఓ తుండూ. ఆ తుండులో యిచ్చరూపాయి కట్టిన ఓ గుడ్డపీలికా తప్ప మరేం లేవు వస్తూనే రాయుడిగారి దగ్గర కెళ్ళాడు .. రాయుడుగారా వూరి పంచాయితీ ప్రెసిడెంటు. విక్కచ్చయిన మనిషి - విజాయితీపరుడు అని ప్రజలందరి నోటా విన్పిస్తుందాయన గురించి తనకు చేతనయినంతలో ఊరి కెంతో కొంత మేలు జరపాలనే తపన ఆయనలో ఉంది.

పరుశురాఁవుడు రాయుడుగారి నేదేనా పనిప్పించమన్నాడు. కుక్కలా యిస్వాసంగా పడుంటానన్నాడు. గొడ్డులా సాకిరీ పేత్తానన్నాడు. వాడి మాటలమీద వాడిమీద వెంటనే గురి ఏర్పడింది రాయుడుగారికి. ఎదుటిమనిషిని ఒక్క-

చూపులో చదవటం రాయుడిగారికి వెన్నతో పెట్టిన విద్య.

ఏటి కవతలవున్న మెరకను సాగులోకి తీసుకురావడానికి ప్రయత్నం చెయ్. దాంతోపాటు యింటి దగ్గర పశువుల్ని కడగటం. మేత మేపటం కూడా చెయ్యాలి. చెయ్యగలవా? అని అడిగారు. సిత్తం అని ఒక్కమాటలో తేల్చేశాడు. పనిలో కుదిరిపోయాడు పరుశురాంవుడు-

పొద్దుటే 'సద్ది'తిని మధ్యాహ్నానికింత అన్నం మూటగట్టుకుని వెళ్లిపోయేవాడు పరుశురాంవుడు. తొలిరోజు మెరకను చూస్తూనే విస్తుపోయాడు-అంతా రాయి. రప్ప, యిసక, పిచ్చిదొంకలు.... యిది తనకు 'పరిచ్ఛే'నన్నుకున్నాడు. ఆర్నెల్లు తిరిగేసరికి దాన్నో కొలిక్కి తెచ్చాడు- రాయుడుగారికి వాడి 'శ్రమశక్తి' మీద నమ్మకం పెరిగింది. సాయంత్రం వరకూ మెరక పనీ, సాయంత్రం యింటికొచ్చి పశువుల పనీ చూసుకునేవాడు. రాత్రి తిండి తిని పశువులశాల దగ్గర సిమ్మెంటు బెంచీమీద నిద్రపోయేవాడు- మరుసటి సంవత్సరంలో మెరకలో మిరప పండించాడు. మొక్కజొన్న వేశాడు. సతల్పితాలిచ్చాయ్.

ప్రస్తుతం శివాలచ్మి టీకొట్టుఉంటున్న పాక ప్రక్కనే ఓ రెండు గదుల పూరిల్లు కట్టించి రాయుడుగారు పరుశురాంవుణ్ణందులో ఉండమన్నాడు. పరుశురాంవుడు రాయుడుగారి కాళ్ళకు మొక్కేడు..

"ఒరేయ్- కష్టపడిపనిచేసే వాళ్ళంటే నాకిష్టం.... వాళ్ళ జీవితాలు సుఖాంతమవుతాయన్నది నా నమ్మకం, సిద్ధాంతం కూడా: సోమరిపోతుగా బ్రతికేవాళ్లంటే అందుకే నాకసహ్యం, శ్రమించేవాణ్ణి, నీతి నిజాయితీలు గలవాణ్ణి నేనెప్పుడూ ఆదరిస్తాను. ప్రేమిస్తాను. నువ్వు ఒళ్ళు దాచుకోకుండా కష్టించావు. నీ కష్టానికి తగిన ప్రతిఫలం ముట్టజెప్పడం నా కనీస కర్తవ్యం- యిందులో నేనేదో చేశాననే భావం నీలో రాకూడదు" అంటూ పరుశురావుడి భుజం తట్టి "వెళ్లు" అన్నారు.

ఆ ఊళ్ళో ఉన్న పెద్ద తలకాయల్లో కల్లా బాగా చదువుకున్నవారు రాయుడుగారొక్కరే. 'చదువు మనిషిలో విజ్ఞానాన్ని సంస్కారాన్ని కలిగిస్తుందని' ఆ ఊళ్లో పిల్లలు చదువుకోవటానికెక్కువ దోహదం చేసిందీ ఆయనే. చదువుకుని, అభివృద్ధిలోకి వచ్చి — ఆఫీసర్లయిన వాళ్ళుకూడా యీరోజు ఆ ఊరి వాళ్ళలో పాతిక ముప్పయిమంది ఉన్నారంటే అదంతా ఆయన చలవే-యిప్పుడింకెంతో మంది పట్నంలో చదువుకుంటున్నారు కూడా—

రెండేళ్ళు గడిచాయ్ ...రాయుడుగారి నాలుగో కూతురు 'ఆదితల్లి' మొగుడు అర్ధరాత్రి పొలంనుంచి వస్తుంటే పాము కాటుకు గురయి చచ్చిపోయాడు. యీ

వార్త రాయుడుగారి జీవితం మీద చిత్రమైన దెబ్బ తీసింది. ఆయన ఆరోగ్యంలో అనుకోని మార్పులు వేగ వేగంగా వచ్చేశాయ్. ఆదితల్లి పుట్టినప్పుడే ఆయన భార్య పోయింది. తల్లిలేని పిల్లను ఆయనెంతో అభిమానించేవాడు. మిగతా వాళ్ళందరికంటే ఎక్కువ చనువుంది తండ్రి దగ్గర ఆదితల్లికి. ఆదితల్లికి కనీవినీ యెరుగనంత వేడుగ్గా పెళ్ళి జరిపించారాయన—నాలుగేళ్ళు తిరక్కముందే ...

రాయుడుగారికి కొడుకు ల్లేరు. నలుగురూ కూతుళ్ళే....ఆదితల్లి తండ్రి దగ్గరకు వచ్చేసింది. ఆ పిల్ల ముఖం చూస్తూంటే ఆయన గుండె తరుక్కుపోయేది. దీనికి తోడు ఆ సమయంలోనే ఓ సంఘటన జరిగింది. ఆది మూలిగే నక్కమీద తాటిపండు పడ్డట్టయింది. పరుశురాముడికీ ఆదితల్లికీ మధ్య....??

ఊరు గుప్పుమంది.

రాయుడుగారి గుండెల్లో మంటలు రేగాయ్. రాయుడుగారు పరుశురాముణ్ణి పిలేసాడు- 'క్షమించండి' అంటూ రాయుడుగారి పాదాలమీద మోకరిల్లి నిజాన్ని వొప్పేసుకున్నాడు. రాయుడు గారు పరుశురాముడి చెంప చెళ్ళుమనిపించారు.

విశ్వాస ఘాతకుడా.... తిన్న యింటికే వాసాలు....

'అయ్యా' ఆదితల్లి మధ్యలోనే కలుగజేసుకుంది—

'పెళ్లయి నాలుగేల్లు తిరక్కముందే ముండ మొసానయ్యా .... నువ్వే పేమతో పెంచి నీ సిన్నకూతురి ముకం ఓసారి సూడయ్యా.... కడుపునో నలుసయినా కలిగుంటే దాన్ని జూసుకునయినా నా బతుకు నేను బతికేదాన్ని.... శరీర దరమాన్ని నువ్వు కాదంటావా అయ్యా - యిరవై యేల్లకే మడిగట్టుగూసోడానికి నేనేం సప్పిడి కూడు దింటున్నానా అయ్యా! అబ్బడ్డోడు నా యెంటబడి—నన్నెదవ సూపులు సూసి—నానా రబసా సేస్తూవుంటే వొయిస్సు—వొయిస్సూరుకుంటుందా! మనస్సును కెలికి నన్ను మండబెట్టెత్తూందే— యెవుణ్ణో వొకణ్ణి కట్టుకుని నా బతుగ్గు రచ్చన కలిపించటం మంచిది కాదా అయ్యా- సెప్పు- సాంపరదాయం వొదిలీ-ఎవులో ఏదో అనుకుంతారన్న మాట వొదిలీ ... నా అతిగతీ ఆలోసించి నా బతుగు తెల్లారడానికి నువ్వుదారిసూపించయ్యా... నానే మొగాణ్ణయితే మరో మనువు నువ్వే సూసేవోడివిగా.... సెప్పయ్యా- సెప్పు." కూతురు వాదన సమంజసమైనా రాయుడుగారి మనస్సు అందుకంగీకరించలేదు- ఫలితంగా ఆదితల్లి పరుశురాముడితో లేచిపోయి పూరింట్లో కాపురం పెట్టింది- పదిరోజులపాటు ఊరంతా తలో రకంగా అంది. పల్లెల్లో అది మామూలే. యేం జరిగినా తాటాకు మంటలా గుప్పున లేచి చప్పున చల్లారిపోతుంది—

కాని చల్లారనిది మాత్రం రాయుడు గారి గుండెల్లోని మంటే। దానికి తోడు 'సెల్లెలు' చేసిన పనిని దాని 'అప్పలు' హర్షించలేక తండ్రి ముఖం చూడ్డం మానేశారు. దాంతో రాయుడుగారు మరీ కృంగిపోయారు పర్యవసానంగా అక్కెల్లా మంచంతీసుకుని చివరకు అదితల్లి చేతుల్లోనే అశాంతిగా కళ్ళు మూశారు.

తండ్రి చనిపోయాక ఆస్థి పంపకాల కోసం ముగ్గురప్పలూ మొగుళ్ళతో సహా వచ్చి పెద్దరోజునాడు తగువుపెట్టారు- రాయుడుగారు చనిపోయేముందు విల్లు రాసి 'రిజిష్టరీ' చేయించిన సంగతి తగువునాడు లాయరు సీతాపతిగారు వెల్లడచేశారు.

ఆస్థిలో ఎక్కువ భాగం అదితల్లి పేరనే వ్రాసారు- మిగతా కూతుళ్ళకు కూడా తక్కువేం చెయ్యలేదు.


పరుశురావుడు పూరింట్లోంచి రాయుడుగారి పెంకుటింట్లోకి అదితల్లితో సహా ప్రవేశించాడు- ఆ యిల్లు కూడా అదితల్లికే వ్రాసిచ్చారు రాయుడుగారు.

అక్కణ్ణుంచి త్వరత్వరగా జరిగిన కొన్ని సంఘటనలు యిక్కడ ఉదహరించాలి—

పంచాయతీ ఎన్నికల్లో పరుశురావుడు ఆ ఊరి పంచాయతీ ప్రెసిడెంటయ్యాడు. అందులో ఆదితల్లి మాత్రం ప్రముఖ పాత్ర వహించింది!!

అప్పుడే శివాలచ్చి విజయనగరం నుండి వచ్చి యిక్కడ టీకొట్టు పెట్టుకుంది.పరుశురావుడి పూరింటి పక్క కాళీస్థలంలో పాకవేసుకుందికి పరుశు రావుడే అనుమతిచ్చాడు. మొగదిక్కు లేని శివాలచ్చి మాత్రం యిద్దరి పిల్లల తల్లయింది. 'మీ అయ్యేడుగో' అని పరుశురావుణ్ణి దూరంనుంచే చూపించేది. పరుశురావుడికి శివాలచ్చితో ఉన్న సంబంధం అదితల్లికి తెలిసేక వాళ్ళిద్దరి మధ్యా చిన్న రగడ బయలుదేరింది.

అదితల్లి వోనాడు పురోసుకు చచ్చి పోయింది. కారణం భరించలేని కడుపు నొప్పి. డాక్టరు సర్టిఫికెట్‌తో అదితల్లి శరీరం అగ్నిలో కలిసిపోయింది- ఆ స్థానంలోకి పిలవంచలం వొచ్చింది. పైడి తల్లొచ్చింది. దురగమ్మ వచ్చింది-నర్సు 'వొసంత' వచ్చింది. పంతులమ్మ కనక లత వొచ్చింది. యేదో రకంగా తిరిగి పరుశురావుణ్ణుంచి వీళ్ళందరూ దూరమై పోయారు. శివాలచ్చి ముఖం అసలు చూడటంలేదు పరుశురావుడు. 'నాకు మొగుడివి కానక్కర్లేదు. నా బిడ్డలకి అయ్య వనయినా సెప్పు' అంది.చీదరించు కున్నాడు శివాలచ్చిని, ఆ వూర్నించే పంపేడానికి యేర్పాట్లు చేసాడు. అయితే శివాలచ్చి మునసబు బామ్మర్ది యెంకటేశు గాణ్ణి పట్టేసింది. యెంకటేశు పరుశు రావుడి కుడిభుజం. సివించెలాన్నీ — పైడితల్లినీ, దుర్గమ్మనీ,నర్సు వొసంతనీ



పంతులమ్మ కనకలతనీ అంతకుముందు ఆదితల్లినీ పంపేడానికి యెంకటేశు హస్తం ఉంది. యీ పరిస్థితుల్లో యెంకటేశుతో విరోధం తెచ్చుకోవటం మంచిది కాదని ఊరుకున్నాడు. కాని పరుశురాముణ్ని అనుమానించలేని పరిస్థితుల్లో శివాలచ్చిమి యిద్దరు పిల్లలూ చెరువులోపడి చచ్చిపోయారు. పరుశురాముడు ఆ సమయంలో ఊళ్ళో లేడు. ఊర్నుంచి వచ్చాక శివాలచ్చిమి దగ్గరకెళ్ళి సానుభూతి చూపించి తిరిగి వస్తూ ఆమె ముఖాన్ని తలుచుకున్నప్పుడు మాత్రం పరుశురాముడి కోరమీసాల చాటున విషపు నవ్వు, తలలో మునసబు ఉంచుకున్న రంగి, చిన్నాన్న కేశవులూ మెదిలారు. ఆ తర్వాత తన పిల్లల చావులో పరుశురాముడి చెయ్యి ఉందనే నిజం తెల్సుకునేసరికి చాలా కాలం పట్టింది శివాలచ్చిమికి. మానసికంగా శివాలచ్చిమి చాలా చిదికిపోయిందనే చెప్పాలి.

పాపంచేసిన వారికి అది పండే రోజు ఎప్పుడో అప్పుడు తప్పక వస్తుంది. అవతారం భార్య సుబ్బులు మానభంగం – దుర్మణం. యీ కేసులో మాత్రం

సాక్ష్యాధారాల్తో పరశురాంవుడు ఎంకటేసు దొరికి పోయారు-పరుశురాంవుడు పెద జిల్లిన డబ్బు ఏమాత్రం పనిచేయలేదు. ప్రధమ ముద్దాయి పరుశురాంవుడికి మరణ శిక్ష-అతనికి సహాయం చేసిన యెంకటేశుకు యావజ్జీవ కారాగారశిక్ష విధించారు. కోర్టులోకూడా పరుశురాంవుడు చేసిన వన్నీ ఒప్పుకున్నాడు. పరశురాంవుడు లాయరు మాత్రం పరుశురావుణ్ణి బల వంతంచేసి హైకోర్టుకు అప్పీలు చేయించాడు.

కాని హైకోర్టులో కూడా క్రిందకోర్టు విధించిన శిక్షనే ధృవపరిచారు-పరుశు రాంవుడు క్షమాభిక్ష కోరినా- ఏంచేసినా కోర్టు వినిపించుకోలేదు-

* * *

ఆరోజు టీకొట్టు కొచ్చినవాళ్ళందరికీ పైసలు తీసుకోకుండా టీ యిచ్చింది శివాలచ్మి. అందరూ ఎవరికి తోచిన విమర్శలు వాళ్ళు జేసారు.... శివాలచ్మి మనస్సెందుకో ఉరకలు వేసింది- అస్తమాటూ పడి పడి నవ్వుతూంది-పరుశురావుణ్ని తల్చుకుంటూంది- తిడుతోంది- శాపనార్ధలు పెడుతూంది. అంతలోనే ఏడుస్తుంది.

యెవరికి వారు జారుకున్నారు. అవతారం మాత్రం మనసులోనే యిలా గొణుక్కున్నాడు.

"మడిసి వేసిన నేరాలకు సిచ్చ మరనం కాదు. కానే కాదు ! జీయితంలో మడిసి సేసిన పాపాలకాడిగుండి కొడిగట్టి పోతే-కొత్త పంవురు వింపి మళ్లీ ఆ దీపం యెలిగేలా.... ఆ గుండె మొడారిపోతే కొత్త సివుర్లు తొడిగేలా సెయ్యగలిగిన సట్టంవే సట్టంకాని మడిసిని సంపేవేది సట్టం కాదు- కాకూడదు-మనిస్సుల్లోని యీ దురమార్గం బుద్ధికి పరమగీతం పాడేట్టు సెయ్యగలిగిందే సట్టం-తప్పు చేసిన మనిషిని సంపేత్తే అదుజేసిన దురమార్గం మాసిపోద్దా? ఎదుటోరి గుండెల్లోని సిచ్చు సల్లారిపోతుందా? మడిసిలో సైతన్యం నింపాల-పచ్చేత్తాపం కలిగించాల.. మంవత మానవత సిలికించాల-న లు గు రి కి సాయపడేలా సెయ్యాల... మంచిని పెంచాల. అప్పుడే బురదనోంచి- పద్మం వికసించినట్టుగా దుర్మార్గంనోంచి కారున్నెం యికసిత్తది దుష్టత్తంనోంచి పాప భీతి - కరున పుడతాయ్. మడిసిని సంపేసే సట్టాలకంటె మనిసిని మానసికంగా మార్చే సట్టాలు మహోత్తుముల్ని పెసాదించవా? అదు సేసిన దురమార్గాల్లాటి వాడికల్లెదుటే జరుగుతూంటే సూస్తూ ఊరుకోలేని సైతన్యాన్ని మడిసిలో రగిల్చే సట్టాలు కావాలి. సట్టాలు... రావాలి...."

* * *

మర్నాడు ఉదయం టీకి వెళ్ళిన వాళ్ళందరికీ శివాలచ్మి శవం పాకవాసానికి వేలాడుతూ దర్శనమిచ్చింది.